క్లుప్తంగా

హెల్మెట్ ధారణ తప్పనిసరి



వాహనాలను విడుదల చేస్తున్న డీటీసీ కరీమ్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ద్విచక్ర వాహనచోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఉప రవాణా కమిషనర్ షేక్ కరీమ్ సూచించారు. నగరంలోని పవన్ హోండా షోరూమ్‌లో శుక్రవారం హోండా ద్విచక్రవాహన తయారీ సంస్థ ఆధునిక సాంకేతికతతో రూపొందించిన షైన్ 100 డీఎక్స్, సీబీ 125 హార్నెట్ ద్విచక్రవాహనాలను ఆయన మార్కెట్‌లోకి విడుదల చేశారు. నిబంధనలకు అనుగుణంగా వాహనాలను నడిపితే ప్రమాదాలకు అవకాశం ఉండదని ఆయన అన్నారు. హోండా సంస్థ ఏరియా సేల్స్ మేనేజర్ రక్షిత్ పర్కాల మాట్లాడుతూ ఆయా వాహనాల ప్రత్యేకతలను వివరించారు. పవన్ హోండా గ్రూప్ మేనేజింగ్ పార్టనర్లు దంగేటి సురేష్, వీధి శ్రీనివాసరావు, సీఈఓ వీధి శ్రీమాన్ తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ పరీక్షలు



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

దెందులూరు: స్వస్థ్ నారీ, స్వశక్తి పరివార్ శిబిరాల్లో భాగంగా శుక్రవారం చాటపర్రు పీహెచ్‌సీలో 138 మందికి రక్తపోటు మధుమేహం నోటి, రొమ్ము, గర్భాశయ క్యాన్సర్ ఇతర పరీక్షలు నిర్వహించారు. అనారోగ్యం గుర్తించిన వెంటనే ప్రభుత్వ వైద్యశాలలకు వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకోవాలని చాటపర్రు పీహెచ్‌సీ వైద్యాధికారులు ప్రదీప్ చంద్ర, కృష్ణ సూచించారు. ఎంపీహెచ్ఈఓ రామాంజనేయులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు సేవలు అందించారు.

కుటుంబంలో పురుషుల పాత్ర కీలకమే



ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు, వైద్య సిబ్బంది

ఏలూరు (టూటౌన్): ఏలూరు అర్బన్ ప్రాజెక్ట్ పరిధిలోని టైటాస్ నగర్ యూహెచ్‌సీలో పోషణ మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఆరోగ్య కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా అర్బన్ ప్రాజెక్టు సీడీపీఓ ఎ.పద్మావతి పాల్గొని మాట్లాడారు. కుటుంబంలో పురుషుల పాత్ర కూడా ఎంతో ముఖ్యమన్నారు. పౌష్టికాహారం ఆవశ్యకతను వివరించారు. యూహెచ్‌సీ డాక్టర్ దొరసానమ్మ, కార్పొరేటర్లు, అంగన్‌వాడీలు, సూపర్‌వైజర్ పాల్గొన్నారు.

నగరంలో సులభ్ కష్టాలు

- ఏలూరులో ప్రజలకు సరిపడాలేని పబ్లిక్ టాయిలెట్లు
- యూరినల్స్‌కి వెళ్లినా సొమ్ము చెల్లించాల్సిందే
- ఒకటి రెండు మినహా అన్నీ ప్రైవేట్ భాగస్వామ్యమే



ఎన్ఆర్‌పేట ఓవర్ బ్రిడ్జి ఆనుకుని ఉన్న పే అండ్ యూజ్ టాయిలెట్

ఏలూరు (టూటౌన్): ఓ పక్క స్వచ్ఛ నగరంగా తీర్చిదిద్దాలనే సంకల్పం, మరో పక్క పబ్లిక్ టాయిలెట్లు అందుబాటులో లేక నానా ప్రజలకు అవస్థలు ఇదీ ఏలూరులో నిత్యం కన్పించే సన్నివేశం. జిల్లా కేంద్రంగా ఉన్న ఏలూరు నగరానికి దాదాపు వందకు పైగా గ్రామాలకు చెందిన ప్రజలు నిత్యం వివిధ పనుల నిమిత్తం వచ్చి వెళుతుంటారు. ఆస్పత్రులకు వచ్చే వారికి కొంత వెసులుబాటు ఉన్నా మార్కెట్, ఆఫీసు పని నిమిత్తం వచ్చే వారికి కనీసం యూరినల్స్‌కు వెళ్లాలన్నా చుక్కలు కన్పిస్తున్నాయి. వీరంతా ఎదో ఒక గోడ పక్కన, ఖాళీ ప్రదేశాల వద్ద పని కానిచ్చేయాల్సిన దుస్థితి నెలకొంది. నగరపాలక సంస్థ క్రమేణా పబ్లిక్ టాయిలెట్ల నిర్వహణ నుంచి తప్పుకోవడం, ప్రైవేట్ భాగస్వామ్యంలో పబ్లిక్ టాయిలెట్లను ఏర్పాటు చేయడమే ఇందుకు కారణం. గతంలో ప్రతి సెంటర్‌లోనూ పబ్లిక్ టాయిలెట్లు ఉండేవి. వీటి స్థానంలో ప్రైవేట్ భాగస్వామ్యంలో పే అండ్ యూస్ పద్ధతిన అక్కడక్కడా టాయిలెట్లు ఉన్నాయి. ఇవీ పూర్తిస్థాయిలో ప్రజల అవసరాలు తీర్చలేక పోతున్నాయనే విమర్శలు ఉన్నాయి. ఏలూరు నగరంలో సుమారు 3.70 లక్షల మంది జనాభా నివశిస్తున్నారు.

రద్దీ ప్రదేశాల్లో కన్పించని పబ్లిక్ టాయిలెట్స్

నగరంలో నిత్యం అత్యంత రద్దీగా ఉండే వన్‌టౌన్ మార్కెట్ ఏరియాతో పాటు ఆర్ఆర్‌పేట, పవర్‌పేట, ఎన్ఆర్‌పేట, జిల్లా పరిషత్, ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్, కలెక్టరేట్ కార్యాలయ పరిసరాల్లో ప్రజల యూరినల్స్ వంటి అవసరాలను తీర్చుకునేందుకు పబ్లిక్ టాయిలెట్స్ లేవు. ఉన్నవాటికి సొమ్ము చెల్లించాల్సి వస్తుంది. దూర ప్రాంతాల నుంచి వచ్చి వెళ్లే వారు తమ అవసరాలను బహిరంగ ప్రదేశాల్లోనే తీర్చుకోవాల్సి వస్తుంది. దీంతో ఆయా ప్రాంతాల్లో దుర్గంధం వెదజల్లుతోంది. ఫలితంగా ఆయా మార్గాల్లో వెళ్లేవారు ముక్కు మూసుకోవాల్సిన దుస్థితి నెలకొంది. ఆర్ఆర్‌పేట మెయిన్‌రోడ్డులో ఎక్కడా బహిరంగ మూత్ర విసర్జన శాలలు కూడా లేకపోవడంతో ఎక్కువ శాతం మంది స్థానిక ఎన్‌టీఆర్ పార్కు గోడల పక్కనే యూరినల్స్ పోసేస్తున్నారు. నరసింహారావుపేటలోనైతే రైల్వే ట్రాక్ రోడ్డులోకి వెళ్లి అన్ని కార్యక్రమాలు అక్కడే కానిచ్చేస్తున్నారు. ఇప్పటికైనా నగరపాలక సంస్థ అధికారులు రద్దీ ప్రదేశాల్లో బహిరంగ మూత్ర విసర్జన శాలలైనా ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

చాలా ఇబ్బందికరం



నిత్యం మా ఊరు నుంచి ఏలూరు పనిమీద ఉదయం వచ్చి సాయంత్రం వెళుతుంటాను. ఈ మధ్యలో అర్జెంటుగా యూరినల్స్‌కు వెళ్లాలన్నా చాలా ఇబ్బందికరంగా ఉంది. ఏదో ఒక ఆఫీసులోనో, తెలిసిన వారి కార్యాలయాల వద్దో అవసరం తీర్చుకోవాల్సి వస్తుంది. నగర పాలక సంస్థే రద్దీని బట్టి బహిరంగ మూత్ర శాలలను ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

– వెంపా నాగరాజు, పాలగూడెం, ఏలూరు మండలం

ప్రజావసరాలను తీర్చాలి



నగర జనాభాతో పాటు సమీప ప్రాంతాల నుంచి వచ్చే ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని పబ్లిక్ టాయిలెట్స్ ఏర్పాటు చేయాలి. గతంలో పబ్లిక్ టాయిలెట్స్‌ను మున్సిపాలిటీనే నిర్వహించేది. కాల క్రమేణా వాటి నిర్వహణను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగిస్తూ వస్తున్నారు. దీంతో యూరినల్స్‌కు వెళ్లాలన్నా సొమ్ములు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

– పిచ్చుక ఆదిశేషు, స్థానికుడు, ఏలూరు

సంక్షేమ వసతి గృహాల్లో కలెక్టర్ తనిఖీ



అమీనాపేట వసతి గృహం విద్యార్థినులతో మాట్లాడుతున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు (టూటౌన్): ఏలూరు అమీనాపేటలో ప్రభుత్వ సాంఘిక సంక్షేమ, వెనుకబడిన తరగతుల బాలికల వసతి గృహాలను శుక్రవారం రాత్రి కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఇక్కడి సౌకర్యాలు, బోధన, వసతి గృహాల పరిసరాల్లో పరిశుభ్రత, టాయిలెట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ వసతి గృహాల్లో విద్యార్థులకు ఇంటిని మరిపించే విధంగా వసతి సౌకర్యాలు కల్పించాలన్నారు. దోమలు వ్యాపించకుండా వసతి గృహాల ఆవరణ, పరిసరాల్లో ఫాగింగ్ చేయించాలని ఆదేశించారు. కిటికీలకు దోమ తెరలు ఏర్పాటు చేయాలన్నారు. వంట చేసే ప్రాంతాల్లో పరిశుభ్రత పాటించాలని, మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని అన్నారు. స్టడీ అవర్స్‌లో విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధన చేసి, ఉత్తీర్ణతా శాతం పెంచేలా కృషి చేయాలని ఆదేశించారు. విద్యార్థులకు మినరల్ వాటర్ అందించాలని, టాయిలెట్ల వద్ద శుభ్రత పాటించాలని సూచించారు. విద్యార్థినులకు గుడ్ టచ్, బాడ్ టచ్‌ల గురించి వివరించారు. సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటానని కలెక్టర్ హెచ్చరించారు. కలెక్టర్ వెంట సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ వై.విశ్వమోహన్ రెడ్డి, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖాధికారి ఆర్ నాగరాణి, వసతి గృహ సిబ్బంది పాల్గొన్నారు.

ఏపీ ఎన్‌జీవోస్ అభివృద్ధికి కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

ఏలూరు(మెట్రో): ఉద్యోగుల సమస్యల పరిష్కారం, అభివృద్ధికి పోరాడుతున్న ఏపీ ఎన్‌జీవోస్ సంఘం అభివృద్ధికి ప్రతిఒక్కరూ కృషిచేయాలని ఏపీ ఎన్‌జీవో సంఘం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాస్ అన్నారు. ఏలూరు జెడ్పీ ఆవరణలోని పంచాయతీ రాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘ భవనంలో ఏలూరు తాలూకా ఏపీ ఎన్‌జీవో సంఘం కార్యవర్గ సమావేశం శుక్రవారం అధ్యక్షుడు గొన్నూరి శ్రీధర్ రాజు, కార్యదర్శి కప్పల సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ ఉద్యోగుల సంక్షేమానికి 70 సంవత్సరాలు నుంచి సేవలు అందిస్తున్న సంఘంగా ఏపీ ఎన్జీవో సంఘాన్ని అభివర్ణించారు. త్వరలోనే ఏలూరు తాలుకా యూనిట్ ఎన్నికలను ప్రజాస్వామ్య పద్ధతిలో నిర్వహిస్తామన్నారు. జిల్లా కార్యదర్శి నెరుసు రామారావు మాట్లాడుతూ ఇప్పటికే పోలవరం, కొయ్యలగూడెం యూనిట్ ఎన్నికలను నిర్వహించామని తెలిపారు.

సీఆర్ఆర్‌లో విజయవంతంగా హ్యాకథాన్



హ్యాకథాన్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ప్రతినిధులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక సీఆర్ రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఈ నెల 18, 19 తేదీల్లో అంతర్గత స్మార్ట్ ఇండియా హ్యాకథాన్‌ను విజయవంతంగా నిర్వహించామని ప్రిన్సిపాల్, ఐఐసీ ఛైర్మన్ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. విద్యార్థుల సృజనాత్మత ఆలోచనలు, టీమ్ వర్క్, కోడింగ్, వినూత్న ఆవిష్కరణలతో క్యాంపస్ కళకళలాడిందని, ఈ హ్యాకథాన్‌లో మొత్తం 45 జట్లు ఎస్ఐహెచ్-2025 పోర్టల్‌లో అప్‌లోడ్ చేసేందుకు ఎంపికయ్యాయని చెప్పారు. కార్యక్రమంలో మొత్తం 570 మంది విద్యార్థులు పాల్గొని విభిన్న రంగాలకు సంబంధించి కృత్రిమ మేథ, విపత్తు నిర్వహణ, వారసత్వ సంస్కృతి, రోబోటిక్స్, స్మార్ట్ ఆటోమేషన్ ఆలోచనలను ప్రదర్శించారన్నారు. ఈ కార్యక్రమంలో 10 అత్యుత్తమ ప్రాజెక్టులకు డీటైల్డ్ ప్రపోజల్ తయారు చేయాలని, వాటిని అటల్ ఇంక్యుబేషన్ సెంటర్‌లో మరింత అభివృద్ధికి కళాశాల ప్రోత్సాహం అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ జాస్తి మల్లికార్జునుడు, యాజమాన్య కమిటీ సభ్యుడు కొండా హరిరామ కృష్ణంరాజు, ఐఐసీ కన్వీనర్ ఎం వీరకుమారి, ఐఐసీ అధ్యక్షురాలు ఐ.హేమలత, ఐఐసీ ఉపాధ్యక్షురాలు పి.నాగదీప్తి తదితరులు పాల్గొన్నారు.

సాల్వేషన్ ఆర్మీ మిలీనియం చర్చిలో వేడుకలు



వేడుకలో పాల్గొన్న కెప్టెన్ రత్నకుమార్, సంఘ పెద్దలు, విశ్వాసులు

ఏలూరు టౌన్: భారతదేశంలో రక్షణ సైన్యం ప్రారంభించి 142 వసంతాలు పూర్తిచేసుకున్న తరుణంలో ఏలూరు ఆదివారపుపేటలోని సాల్వేషన్ ఆర్మీ మిలీనియం చర్చిలో వేడుకలు నిర్వహించారు. శుక్రవారం 143వ వసంతంలోకి అడుగుపెట్టిన నేపథ్యంలో చర్చి వద్ద సంఘ కాపరి కెప్టెన్ నీలా రత్నకుమార్ రక్షణ సైన్యం పతాకాన్ని ఎగరవేసి సంఘ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. సాల్వేషన్ ఆర్మీ ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాల్లో తమ సేవలను అందిస్తోందన్నారు. అవసరత ఎక్కడ ఉంటుందో రక్షణ సైన్యం అక్కడ ఉంటుందనే నినాదంతో సంస్థ పనిచేస్తుందని వివరించారు. పేదలకు విద్య, వైద్య రంగాల్లోనూ విశిష్ట సేవలు అందించిందని తెలిపారు. అనంతరం ఏలూరు మండల నాయకులు మేజర్ డి.ఏసురాజ్యం దైవ వాక్యాన్ని అందించి, ప్రజల కోసం ప్రార్థనలు చేశారు. సాల్వేషన్ ఆర్మీ వ్యవస్థాపకులు విలియం బూత్, క్యాథరిన్ బూత్ విగ్రహాలకు పూలమాలలు వేసి వారి సేవలను కొనియాడారు. అనంతరం రిటైర్డ్ దైవప్రియ కుటుంబాన్ని పరామర్శించి, కెప్టెన్ నీలా సుకన్యరాయ్ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఆఫీసర్స్, గృహ సమితి, సంఘ పెద్దలు, యువత, పిల్లలు, సంఘ సభ్యులు ఉన్నారు.

సంక్షిప్తంగా..

సమస్యలు పరిష్కరించాలి

ఏలూరు (టూటౌన్): పెయింటింగ్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని యూనియన్ కన్వీనర్ లొట్ల సత్యనారాయణ కోరారు. ఈనెల 21న నిర్వహించే పెయింటింగ్ కార్మికుల నిర్మాణ జనరల్ బాడీ సమావేశాన్ని విజయవంతం కోరుతూ శుక్రవారం స్థానిక ఇఫ్టూ జిల్లా కార్యాలయంలో యూనియన్ సమావేశం నిర్వహించారు. రెడ్డి, ప్రసాద్, రమణ, రాజు, హలీం ప్రతాప్, కృష్ణ, కిషోర్, జిలాని, పెద్ది రాజు, జోసెఫ్, ఈశ్వర్, చిన్న తదితరులు పాల్గొన్నారు.

ఫోన్ ఇన్ కార్యక్రమం

ఏలూరు(మెట్రో): ఏలూరు జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ఆధ్వర్యంలో ఫోన్-ఇన్ కార్యక్రమం నిర్వహించారు. సుమారు 53 మంది పౌరులు ఫోన్ కాల్స్ ద్వారా రోడ్లు, తాగునీరు, విద్యుత్, పింఛన్లు, విద్య, వైద్యం, సంక్షేమ పథకాలు, వ్యవసాయ సమస్యలు వంటి అంశాలపై తమ సమస్యలను వివరించారు. ఈ సమస్యలను పరిష్కరించాలని అధికారులను చైర్ పర్సన్ పద్మశ్రీ ఆదేశించారు.

సమస్యలపై చర్చ

ఏలూరు(మెట్రో): కలెక్టర్ కె.వెట్రి సెల్విని శుక్రవారం జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్ కలిసి పలు అంశాలపై చర్చించారు. ఫోన్ ఇన్ కార్యక్రమంలో వచ్చిన ప్రజా సమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని కోరారు. ఏలూరు జీజీహెచ్‌లో వెయిటింగ్ హాళ్ల నిర్మాణం, సత్యసాయి తాగునీటి పథకం సిబ్బందికి జీతాల సమస్య పరిష్కారంపై చర్చించారు.

28న సాహితీ పట్టాభిషేక మహోత్సవం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): తెలుగు అసోసియేషన్ ఆఫ్ నేషనల్ అకాడమీ బుక్ ఆఫ్ రికార్డ్స్, ప్రపంచ తెలుగు సంస్కృతి కళావేదిక, తెలుగు రైటర్స్ అకాడమీ, శ్రీ శ్రీ కళావేదిక సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 28వ తేదీన సాహితీ పట్టాభిషేక మహోత్సవం నిర్వహించనున్నట్టు ఆ సంస్థ జాతీయ ప్రధాన కార్యదర్శి పార్థసారథి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీశ్రీ కళావేదిక 155వ కార్యక్రమంగా ఈ కార్యక్రమాన్ని హైదరాబాదులోని బిర్లా ఆటోరియంలో నిర్వహించనున్నట్టు వివరించారు. ఎంపిక చేసిన సాహితీవేత్తలకు అవార్డులు ప్రదానం చేస్తామని పార్థసారథి పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరంలోని వివిధ సబ్‌స్టేషన్ల పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏలూరు డివిజన్ ఈఈ కేఎం అంబేద్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. శాంతినగర్ సెక్షన్ పరిధిలోని సత్రంపాడు, సిద్దార్థ ఫీడర్ల పరిధిలో ఉన్న సత్రంపాడు మెయిన్ రోడ్డు, సీఆర్ఆర్ పబ్లిక్ స్కూల్, సౌభాగ్యలక్ష్మీ నగర్, ఆర్‌టీసీ కాలనీ, మండవ వారి స్ట్రీట్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. 1వ పట్టణంలో వెంకన్న చెరువు సబ్ స్టేషన్ పరిధిలోని కొత్తగూడెం, చాటపర్రు రోడ్డు ఫీడర్ల పరిధిలో ఉన్న ఏడుకాలువల సెంటర్, కొత్తగూడెం, మోటేపల్లివారి వీధి, మేకవారి వీధి, కబేళా ఏరియా, తూర్పు వీధి శివాలయం ఏరియా, సాయిబాబా గుడి ఏరియా, ప్రేమాలయం రోడ్డు, పెదమాలపల్లి, తూర్పువీధి, గంగానమ్మగుడి ఏరియా, ఫిల్‌హౌస్ పేట, చాటపర్రు రోడ్ పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని తెలిపారు.

'చలో ప్రభుత్వ మెడికల్ కాలేజీ'కి తరలిన శ్రేణులు



జంగారెడ్డిగూడెం : ఏలూరు వెళుతున్న నాయకులు

జంగారెడ్డిగూడెం: చలో ప్రభుత్వ మెడికల్ కాలేజీ కార్యక్రమానికి జంగారెడ్డిగూడెం పట్టణ, మండలం నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు ఏలూరుకు భారీగా తరలివెళ్లారు. వాహనాలను జంగారెడ్డిగూడెం పట్టణ అధ్యక్షులు కర్పూరం గవరయ్య గుప్త, యువజన నాయకులు ఆదిత్య జెండా ఊపి ప్రారంభించారు. జిల్లా యువజన విభాగ కార్యదర్శి మహమ్మద్ ఉమర్ షరీఫ్ ఆధ్వర్యంలో యువత ఏలూరు వెళ్లా రు. ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ ఆపా లని డిమాండ్ చేశారు. పట్టణ యువజన విభాగ అధ్యక్షుడు నేకూరి కిషోర్, మండల యువజన వి భాగం అధ్యక్షుడు గంజి వినోద్, మండల విద్యార్థి విభాగం అధ్యక్షుడు సంద్ర రాము, కౌన్సిలర్ ఉగ్గం దుర్గాప్రసాద్, టౌన్ బూత్ కమిటీల కన్వీనర్ కాసర శేషారెడ్డి, నాయకులు షేక్ రఫీ, కళ్యాణ్ వర్మ, మా సుకొండ అశోక్, జమీరు, సాబోలు రవి, నీలపాల అనిల్, నల్లమిల్లి సన్నీ, వీరంకి మాధవ, కొత్తూరు పెద్ద, ముప్పిడి జగదీష్, సగ్గు ఏసుబాబు, అమర్, దిరిసిపాము సోమరాజు, కొండ, సత్తార్, దయ, యాక్టర్ భాష, గంట శివ, మోటూరు మణి వెళ్లారు.

'చలో రాజమండ్రి'కి మండల నాయకులు

ద్వారకాతిరుమల: ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ శుక్రవారం చేపట్టిన చలో రాజమండ్రి కార్యక్రమానికి మాజీ హోం మంత్రి తానేటి వనిత ఆధ్వర్యంలో మండలానికి చెందిన నాయకులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. వీరంతా పార్టీ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు జక్కంపూడి రాజా నివాసానికి, అక్కడి నుంచి ప్రభుత్వ మెడికల్ కళాశాలకు బయలుదేరారు. అక్కడ పోలీసులు అడ్డుకోవడంతో వారు ఆందోళనకు దిగారు. సీఎం చంద్రబాబుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రైవేటీకరణను ఆపకపోతే ఊరుకోబోమని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, రాష్ట్ర యువజన విభాగ సంయుక్త కార్యదర్శి పెద్దిరెడ్డి జ్యోతి శ్రీనివాస్, రాష్ట్ర మైనారిటీ సెల్ సంయుక్త కార్యదర్శి షేక్ మస్తాన్ బాష, మండల కన్వీనర్ మల్లిపూడి నాగమణి, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు దాసరి రాంబాబు, పంగిడిగూడెం, ఐఎస్ రాఘవాపురం సర్పంచ్‌లు ప్రత్తిపాటి యోహాను, పసుపులేటి ఏసుబాబు, చెలికాని బుల్లియ్య, పెద్దిరెడ్డి నాగేశ్వరరావు, జి.కొత్తపల్లి, కొమ్మర ఎంపీటీసీలు బిరుదుగడ్డ బజారియ్య, మానుకొండ కన్నయ్య, దాసరి ఏసురత్నం, గుమ్మడి శ్రీను, భోగరాజు చిన్ని, బొంతు శ్రీను తదితరులున్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	24	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	30	చిక్కుడు కాయలు	64
వంకాయలు (కాంతులు)	36	బీన్లచిక్కుడు	00
వంకాయలు (తెలుపు)	00	చామదుంపలు	36
బెండకాయలు	30	ములక్కాడలు	10, 15
పచ్చిమిర్చి	36	కంద	00
కాకర కాయలు	34	బీట్‌రూట్	38
బీరకాయలు	34	కీరా దోస	40
బీరకాయలు (పందిరి)	40	ఫ్రెంచ్‌బీన్స్	70
క్యాబేజీ	26	అల్లం	70-96
క్యారెట్	44	కొత్తిమీర (కట్ట)	25
దొండకాయలు	34	పాలకూర	10
బంగాళదుంపలు	34	తోటకూర	10
ఉల్లిపాయలు	15	చుక్కకూర	10
గోరుచిక్కుడు	40	గోంగూర	07-10
దోసకాయలు	26	పుదీనా	05
అనపకాయ (1)	20	క్యాప్సికమ్	80
పొట్లకాయ(1)	20	చిలకడదుంప	48

విద్యా సంస్థల బస్సులపై 11 కేసులు



బస్సులను తనిఖీ చేస్తున్న అధికారులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఏలూరు జిల్లా వ్యాప్తంగా శుక్రవారం నిర్వహించిన మోటారు వాహనాల తనిఖీలో విద్యా సంస్థల బస్సులపై 11 కేసులు నమోదు చేసి, రూ.37,400 అపరాధ రుసుం విధించినట్టు ఉప రవాణా కమిషనరు షేక్ కరీమ్ తెలిపారు. విద్యా సంస్థల బస్సులను ఫిట్నెస్ లేకుండా నడుపరాదని, లైసెన్స్ లేని వ్యక్తులు బస్సులు నడుపరాదని హెచ్చరించారు. విద్యార్థులను సురక్షితంగా తీసుకువెళ్లాలని, రహదారి భద్రతా నియమాలను తప్పక పాటించాలని ఆదేశించారు. నిబంధనలు పాటించని విద్యా సంస్థల బస్సులను, ప్రైవేటు వాహనాలను సీజ్ చేస్తామని ఆయన హెచ్చరించారు.

ప్రభుత్వంపై మోగిన రణభేరి

జంగారెడ్డిగూడెం: ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం పట్ల నిరసన వ్యక్తంచేస్తూ చేపట్టిన రణభేరి బైక్ జాతా శుక్రవారం జంగారెడ్డిగూడెం చేరింది. స్థానిక బాలుర హైస్కూల్ వద్ద ఉపాధ్యాయులను ఉద్దేశించి జిల్లా నాయకులు ఎంవీ శ్యాంబాబు, ముస్తఫా ఆలీ, రవికుమార్‌లు మాట్లాడారు. ఉపాధ్యాయులకు బోధనేతర పనులు అధికంగా ఉన్నాయని, అనేక యాప్‌ల పని భారంతో సతమతం అవుతున్నారని వాపోయారు. ఉపాధ్యాయులకు ఆన్‌లైన్ తరహా శిక్షణల వల్ల వారి బోధన సమయం తగ్గిపోతుందని తెలిపారు. అందుకే నిరసన చేపట్టామన్నారు. యూటీఎఫ్ పోరాటం విజయవంతంగా జరగాలని ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు శివ ప్రసాద్ ఆకాంక్షించారు. అనంతరం యూటీఎఫ్ భవన్‌లో ఏర్పాటుచేసిన సదస్సులో రాష్ట్ర కార్యదర్శులు అరుణకుమారి, జ్యోతిబాసు, సుభా షిణి మాట్లాడుతూ సమస్యలపై ఈ నెల 24లోగా ప్రభుత్వం స్పందించాలని, లేకుంటే 25న గుంటూరులో భారీ బహిరంగ సభ నిర్వహిస్తామని వెల్లడించారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై అక్రమ కేసు

చింతలపూడి : ఎన్నికలు జరిగి ఏడాదిన్నర దాటి పోతున్నా వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టడం తగ్గలేదని ఆపార్టీ నాయకుడు శెట్టిపల్లి మోహన్‌రావు ఆరోపించారు. తాజాగా చింతలపూడి మండలం పట్టాయిగూడెం గ్రామానికి చెందిన మారం అప్పారావు అనే కార్యకర్తపై హత్యాయత్నం కేసు నమోదు చేసి జైలుకు పంపిన ఘటన శుక్రవారం జరిగింది. ఈనెల 4వ తేదీన గణేష్ నిమజ్జనం సందర్భంగా గ్రామంలోని మద్యం బెల్ట్ షాపు వద్ద జరిగిన చిన్న ఘర్షణను ఆసరాగా చేసుకుని అప్పారావు తనపై హత్యాయత్నానికి పాల్పడినట్లు స్వర్ణాల మారేశ్వరి అనే మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి అప్పారావును శుక్రవారం కోర్టుకు హాజరు పరచగా రిమాండ్ విధించారు. ఈ అక్రమ కేసుపై గ్రామానికి చెందిన నాయకులు శెట్టిపల్లి మోహన్‌బాబు, చిగురు పాటి సత్తిబాబు, మారం వెంకటేశ్వర్రావులు ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ నాయకులు పోలీసులపై ఒత్తిడి తెచ్చి హత్యాయత్నం కేసు పెట్టించారని ఆరోపించారు. గ్రామంలో సమస్యలు ఉంటే కూర్చుని పరిష్కరించుకోవాలని, ఇలా తమ పార్టీ కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి వేధించడం సమంజసం కాదని హితవుపలికారు. పార్టీ కార్యకర్తలను వేధింపులకు గురిచేస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. విషయాన్ని పార్టీ అధ్యక్షులు జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకవెళతామని తెలిపారు.

ఘనంగా ముగిసిన పవిత్రోత్సవాలు

జంగారెడ్డిగూడెం: గోకుల తిరుమల పారిజాత గిరి వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న పవిత్రోత్సవాలు శుక్రవారం పూర్ణాహుతి, కుంభ ప్రోక్షణ, పవిత్ర అవరోహణ, శాంతి కల్యాణం తదితర కార్యక్రమాలతో ముగిశాయని ఆలయ ఈఓ కలగర శ్రీనివాస్ తెలిపారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ (ఇంద్ర)	21.00	33
ఏలూరు - జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర)	21.30	31
ఏలూరు -బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	40
ఏలూరు - బీహెచ్ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	16
ఏలూరు - అమరావతి (ఇంద్ర)	19.00	రద్దు

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.45	4820	28
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.15	4822	24
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	19
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	10.45	4798	24
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	21.15	4802	30
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	34
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	26
ఏలూరు - తిరుపతి	16.00	4830	32